సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 7 । జూలై । 2023



ప్రాక్టీస్‌పై అవగాహన

మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్ విద్యార్థులకు గురువారం ప్రాక్టీస్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

- 8లో ▸



సిలబస్ పూర్తిచేయాలి

తెలంగాణ వర్సిటీలో పీజీ కోర్సులకు సంబంధించి సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని రిజిస్ట్రార్ యాదగిరి ఆదేశించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.9 /23.3

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం చిరుజల్లులు కురియవచ్చు. సాయంత్రం మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా గురువారం మైనర్ ఇరిగేషన్ అధికారులు నీటి విడుదలను చేపట్టారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా కాలువ ఆయకట్టుకు నీరందకపోవడం, అంతే కాకుండా చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకానికి నీటి విడుదల చేపట్టాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించడంతో అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్ట్‌లోకి కాళేశ్వరం నీరు వస్తుందని భరోసా ఉండటంతో కాలువ ద్వారా నీటి విడుదలను చేపట్టారు. ప్రాజెక్ట్‌లో 21 టీఎంసీల నీరు ఉండగా వానాకాలం సీజన్ కోసం నీటి విడుదల చేపట్టడం ప్రాజెక్ట్ చరిత్రలో ఇదే తొలిసారి. లక్ష్మి కాలువపై 50 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల వరద నీరు కొనసాగుతుంది.

ప్రతి శనివారం పాస్‌పోర్ట్ స్పెషల్ డ్రైవ్

మోర్తాడ్(బాల్కొండ): కొత్త పాస్‌పోర్ట్‌లు, రెన్యూవల్, పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్‌ల కోసం నిరీక్షిస్తున్నవారికి విదేశాంగ శాఖ శుభవార్తను అందించింది. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు, తపాల శాఖ జిల్లా కార్యాలయాల్లో పాస్‌పోర్ట్ దరఖాస్తులకు క్యూ పెరిగిపోతుండడంతో సెలవు దినాలను కుదించుకోవాలని విదేశాంగ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈనెలలో 8, 15, 22, 29 తేదీల్లో వచ్చే శనివారాల్లో నిజామాబాద్‌లోని పాస్‌పోర్ట్ సేవాకేంద్రం పని చేయనుంది. పాస్‌పోర్ట్‌ల కోసం క్యూ పెరగడంతో అనేకమంది రెన్యూవల్ కోసం నాగ్‌పూర్ రీజినల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రానికి వెళ్లి వస్తున్నారు. మరికొందరు మన రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లోని తపాల శాఖ ప్రధాన కార్యాలయాలకు వెళ్తున్నారు. దీంతో శనివారం కూడా పనిచేయాలని రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి దాసరి బాలయ్య సిబ్బందిని ఆదేశించారు.

వివరాల నమోదు పక్కాగా ఉండాలి

నిజామాబాద్‌అర్బన్ : కేజీబీవీల్లో అకౌంట్ సెక్షన్‌కు సంబంధించి వివరాల నమోదు పక్కాగా ఉండాలని జీసీడీవో వనిత అన్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కేజీబీవీలో పనిచేస్తున్న అకౌంటెంట్లు, ఇతర సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆహార బిల్లులు ఇతర వస్తువుల కొనుగోలు సంబంధించి ఖర్చులు వివరాల నమోదు అన్ని పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ప్రతిఒక్క నిధుల వినియోగం ఆన్‌లైన్ ద్వారా కొనసాగుతుందని దీనిలో పకడ్బందీగా ఉండాలన్నారు. ఈ శిక్షణలో సంబంధించిన సెక్షన్ ఉద్యోగి పుష్ప తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై సర్వేలు చేయాలి



నిజామాబాద్ సిటీ : సీజనల్ వ్యాధులపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తరచుగా సర్వేలు నిర్వహిస్తూ ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం అన్నారు. గురువారం జిల్లా కేంద్రం న్యూ అంబేద్కర్ భవన్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాను జీరో మలేరియాగా చేసిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. జోనల్ మలేరియా ఆఫీసర్ సునీల్, అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య మాట్లాడుతూ ఫ్రైడే ను, డ్రై డేగా పక్కాగా నిర్వహించి దోమ లార్వాను లార్వ దశలోనే చంపాలన్నారు. జిల్లా ఎన్‌వీబీడీసీ ప్రోగ్రాం అధికారి తూకారం రాథోడ్ జిల్లాలో జరుగుతున్న మలేరియా నివారణ కార్యక్రమాలను వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు రమేశ్, విద్యా, సరిత, జిల్లాలోని వైద్యాధికారులు సూపర్‌వైజర్లు తదితరులున్నారు.

ఆర్మూర్ బరిలో రేవంత్!

- ఉత్తర తెలంగాణలో మరింత ఊపు తెచ్చేందుకు కాంగ్రెస్ వ్యూహం
- రాష్ట్ర వ్యవహారాలను నేరుగా పర్యవేక్షిస్తున్న ఏఐసీసీ నాయకత్వం
- ఇప్పటికే వివరాలు సేకరిస్తున్న సునీల్ కనుగోలు సర్వే బృందం
- రైతు గ్రూపులు సహా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న రేవంత్ పోటీ అంశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ ఇచ్చినప్పటికీ పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ వచ్చే శాసనసభ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచి తీరాలనే లక్ష్యంతో సర్వశక్తులూ ఒడ్డుతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని వ్యూహాత్మకంగా ఎత్తులు వేసేందుకు పావులు కదుపుతోంది. జిల్లాల వారీగా పార్టీ బలం, బలహీనతల లెక్కలు వేసుకుంటూ జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో పార్టీ బలంగా ఉండడంతో పాటు ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరిక, అదేవిధంగా మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన జూపల్లి కృష్ణారావు తదితరులు చేరనుండడంతో పార్టీ శ్రేణుల్లో తిరుగులేని ఉత్సాహం పెల్లుబికుతోంది. దక్షిణ తెలంగాణ విషయమై పార్టీ అధినాయకత్వం పూర్తి భరోసాతో ఉంది. ఖమ్మం సభ నుంచే ఎన్నికల శంఖారావాన్ని పార్టీ పూరించింది. తదుపరి టాస్క్‌లో భాగంగా ఉత్తర తెలంగాణ జిల్లాలపై నాయకత్వం ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా బలహీనంగా ఉన్న నిజామాబాద్ జిల్లా నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని బరిలోకి దించేందుకు ఏఐసీసీ నాయకులు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

సోషల్ మీడియాలో వైరల్..

రేవంత్ ఆర్మూర్ నుంచి పోటీ చేస్తారనే విషయమై జిల్లాలోని సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముఖ్యంగా ఆర్మూర్ డివిజన్‌లో పసుపు రైతులు, ఇతర రైతుల గ్రూపుల్లో ఈ అంశం తిరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలపై ప్రభావం కోసమే..!

కర్ణాటక విజయం తరువాత తెలంగాణను చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఇక్కడి వ్యవహారాలను నేరుగా పర్యవేక్షిస్తోంది. దక్షిణ తెలంగాణలో అత్యంత ప్రభావం చూపించే నాయకులు ఉండడంతో ఉత్తర తెలంగాణలో సైతం ఆ స్థాయిలో ప్రభావం చూపించే విధంగా పావులు కదుపుతోంది. పైగా ఉత్తర తెలంగాణలో బీజేపీ ప్రభావం ఉండడంతో పకడ్బందీగా వ్యవహరించేందుకు అధిష్టానం వ్యూహాలు రచిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో తిరుగులేని ప్రజాదరణ ఉన్న రేవంత్‌రెడ్డిని ఆర్మూర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దించేందుకు ఏఐసీసీ నాయకులు సూచించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సునీల్ కనుగోలు సర్వే బృందం వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. రేవంత్ ఆర్మూర్ నుంచి బరిలో ఉంటే ఉత్తర తెలంగాణలో కీలకమైన ఉమ్మడి కరీంగనర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని 25 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత ఆదరణ వస్తుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో నిజామాబాద్ డీసీసీ నాయకత్వం రేవంత్‌ను బాల్కొండ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగాలని ప్రతిపాదించినప్పటికీ ఆ దిశగా వ్యవహారం ముందుకు పడలేదు. ఎన్నికలు సమీపిస్తున్న దశలో ఉత్తర తెలంగాణపై ఫోకస్ పెట్టిన ఏఐసీసీ నేతలు ఆర్మూర్ నుంచి రేవంత్‌ను బరిలో దించేందుకు ఆలోచిస్తుండడం విశేషం. ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ఇక్కడ రేవంత్ విజయం నల్లేరు మీద నడకేనని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.

ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ నేపథ్యంలో రైతుల్లో పార్టీపై అనుకూలత పెరిగింది. ధరణి రద్దు చేస్తామని ప్రకటనతో కాంగ్రెస్‌కు మరింత మద్దతు పెరుగుతోంది. ఈ క్రమంలో రైతుల్లోకి మరింతగా చొచ్చుకెళ్లేందుకు వ్యవసాయపరంగా ముందంజలో ఉన్న ఆర్మూర్ నుంచి రేవంత్‌ను పోటీ చేయించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

కాళేశ్వరం నీళ్లొచ్చాయ్..



సిద్ధంగా ఉన్న ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం మూడో పంపు

- ఎస్సారెస్పీకి చేరుకున్న జలాలు
- వరద కాలువ నుంచి ప్రాజెక్ట్‌లోకి ఎత్తిపోసేందుకు సిద్ధమైన అధికారులు
- నేడు రివర్స్ పంపింగ్‌కు ముహూర్తం ఖరారు

బాల్కొండ : కాళేశ్వరం నీళ్లు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎత్తిపోసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం సాయంత్రానికి వరద కాలువలో కాళేశ్వరం నీళ్లు ఎస్సారెస్పీకి తాకాయి. ఎస్సారెస్పీ పునరుజ్జీవన ఎత్తిపోతల పథకం మూడవ పంప్ ద్వారా ప్రాజెక్ట్‌లోకి ఎత్తిపోసేందుకు శుక్రవారం అధికారులు సర్వం సిద్ధం చేసుకున్నారు. కాళేశ్వరం నీళ్లను వరద కాలువలో రివర్స్ పంపింగ్ ద్వారా ప్రాజెక్ట్ వరకు తీసుకొచ్చేందుకు 2017 ఆగస్ట్‌లో సీఎం కేసీఆర్ ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకానికి శంకుస్థాపన చేశారు. పనులు 2021లో పూర్తయ్యాయి. ప్రస్తుతం వర్షభావ పరిస్థితుల వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి నెల రోజులు గడిచినా భారీ వరద రాలేదు. దీంతో కాళేశ్వరం నీళ్లను ఎస్సారెస్పీకి రివర్స్ పంపింగ్ ద్వారా తరలించేందుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం వరద కాలువలో కాళేశ్వరం నీళ్లు నిండుకుండలా ఉన్నాయి. రోజుకు 0.5 టీఎంసీల నీటిని ఎత్తిపోసి 60 రోజుల్లో 30 టీఎంసీల నీటితో ఎస్సారెస్పీని నింపాలని సీఎం నిర్ణయించారు.

పునరుజ్జీవన పథకం..

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాళేశ్వరం నీటి రివర్స్ పంపింగ్‌తో పునరుజ్జీవనం కానుంది. ప్రభుత్వం కాళేశ్వరం నుంచి నీటిని వరద కాలువ ద్వారా పంపింగ్ చేసి ఏడాదికి 60 టీఎంసీల నీటిని రివర్స్ పంపింగ్ చేసేలా రూపకల్పన చేశారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం పూడిక పేరుకుపోయి నీటి సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయింది. ప్రభుత్వం పునరుజ్జీవన పథకానికి జీవోనం. 587 ప్రకారం రూ. 1,067 కోట్లకు పాలనాపరమైన అనుమతులిచ్చింది.

ఎలా పంపింగ్ చేస్తారంటే..

కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి శ్రీపాద ఎల్లంపల్లికి నీటి సరఫరా చేసే ప్రధాన కాలువ ఎస్సారెస్పీ వరద కాలువను 102 కి.మీ వద్ద క్రాస్ చేస్తుంది. అక్కడి నుంచి మూడు పంపు హౌజ్‌లు నిర్మించి నీటిని ఎస్సారెస్పీకి రివర్స్ సరఫరా చేస్తారు. 11,600 వేల క్యూసెక్కుల నీరు రివర్స్ పంపింగ్ సామర్థ్యంతో పంపు హౌజ్‌లను నిర్మించారు. జగిత్యాల్ జిల్లా రాంపూర్‌లో వరద కాలువ 73వ కి.మీ వద్ద పంపుహౌజ్-1 నిర్మాణం చేపట్టారు. ఒకటవ పంపు హౌజ్‌లో 8 పంపులు ఒక్కో పంపు 1450 క్యూసెక్కుల నీరు పంపు చేసేలా నిర్మించారు. పంపుహౌజ్-2ను జగిత్యాల్ జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వరావు పేటలో వరద కాలువ 34 కి.మీ వద్ద నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్ట్‌కు 100 మీటర్ల దూరంలో ముప్కాల్ మండల కేంద్రం వద్ద మూడవ పంపును నిర్మాణం చేపట్టారు. ప్రతిపంపు 11 మీటర్ల ఎత్తులో నీటిని ఎత్తిపోసేలా డిజైన్ చేశారు.

ప్రయోజనమిది..

ప్రాజెక్ట్‌కు దిగువ భాగాన ఉన్న ప్రాంతం నుంచి నీటిని ఎగువకు రివర్స్ పంపింగ్ చేసి నింపడం వల్ల ప్రాజెక్ట్ ఎప్పుడూ నిండుకుండలా ఉంటుంది. వరద కాలువ రిజర్వాయర్‌గా మారడంతో ఏడాది పొడవున కాలువలో నీరు నిల్వ ఉండి, భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయి.

సిద్ధంగా ఉన్నాయి..

కాళేశ్వరం నీళ్లు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎత్తిపోసేందుకు మోటార్లు అన్ని సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం ముహూర్తం నిర్ణయిస్తే పని ప్రారంభిస్తాం. ఇప్పటివరకు నీళ్లు వరద కాలువలో జీరో పాయింట్ వరకు చేరుకున్నాయి.

– సుధాకిరణ్, ఈఈ, ఎస్సారెస్పీ పునరుజ్జీవనం

దేశ రైతాంగానికి కేసీఆరే శ్రీరామరక్ష

- మంత్రి ప్రశాంత్ రెడ్డి
- వరద కాలువకు చేరుకున్న కాళేశ్వరం నీళ్లు



కాళేశ్వరం జలాలకు పూజలు చేస్తున్న మంత్రి

కమ్మర్‌పల్లి/బాల్కొండ : తెలంగాణ రైతులతో పాటు దేశ రైతాంగానికి సీఎం కేసీఆరే శ్రీరామరక్ష అని మంత్రి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎక్కడో 300 కి.మీ దూరంలో ఉన్న కాళేశ్వరం నీళ్లు రివర్స్ పంపింగ్ ద్వారా వరద కాలువలోకి చేరడం, రాష్ట్ర రైతాంగంపై సీఎంకు ఉన్న చిత్తశుద్ధే దీనికి నిదర్శనమన్నారు. గురువారం కాళేశ్వరం నీళ్లు రివర్స్ పంపింగ్ ద్వారా వరద కాలువలోకి రావడంతో జిల్లా సరిహద్దు కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని వరద కాలువ వంతెన వద్ద, కిసాన్‌నగర్, బస్సాపూర్, బోదేపల్లి, ముప్కాల్ వద్ద వరద కాలువలో కాళేశ్వరం జలాలకు పూలు చల్లి ఆహ్వానించారు. ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి తల్లికి పుష్పాలతో స్వాగతించారు. గోదారమ్మ ఎదురుగా వస్తుందని తాను కలలో కూడా ఊహించలేదని, తన హాయాంలో ఎస్సారెస్పీ పునరుజ్జీవం పనులు పూర్తికావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. 2001లో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. రివర్స్‌పంపింగ్ ద్వారా అందుతున్న నీళ్లు ఏడాదిపొడగునా రైతాంగానికి ఉపయోపడతాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతో ప్రతిపక్షాలు బురద జల్లుతున్నాయన్నారు. రూ.90 వేల కోట్లతో పనులు జరిగితే రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందనడం హాస్యాస్పదమన్నారు. రైతులు ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు.

నేడు ఎస్సారెస్పీలోకి కాళేశ్వరం నీళ్లు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి శుక్రవారం వరద కాలువ నుంచి కాళేశ్వరం నీళలను ఎత్తిపోస్తామని మంత్రి అన్నారు. వరద కాలువ జీరో పాయింట్ వద్ద మంత్రి గురువారం పరిశీలించారు. శుక్రవారం కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బాల్కొండ, ముప్కాల్ మండలాల అధ్యక్షులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, నాయకులు సామ వెంకట్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి, సురాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం నిర్వహించేదెప్పుడు?



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

- తక్షణమే ఏర్పాటు చేయాలని వినతి
- మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బీజేపీ కార్పొరేటర్లు

సుభాష్‌నగర్ : నూతన మున్సిపల్ చట్టం ప్రకారం ప్రతి మూణ్నెళ్లకొకసారి కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని, కాని కార్పొరేటర్లు అడిగేవరకూ నిర్వహించరా అని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి ప్రశ్నించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్, ఇన్‌ఛార్జి కమిషనర్ చిత్రామిశ్రాతో బీజేపీ కార్పొరేటర్లు సమావేశమయ్యారు. తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్రవంతిరెడ్డి మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాలు మూణ్నెళ్లకొకసారి నిర్వహించాలని, ఏడాదికొకసారి తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారన్నారు. 15 రోజుల్లో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని కోరగా, కమిషనర్ త్వరలోనే నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. డివిజన్లలో సదుపాయాల్లేక ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్లు కమిషనర్ దృష్టికి తెచ్చారు. డివిజన్‌కు రూ.10లక్షలు కేటాయిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ న్యాలం రాజు, రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక, మెట్టు విజయ్, బంటు వైష్ణవి రాము, మమతా ప్రభాకర్, ఇందిరా వినోద్, సుమిత్రా కిషోర్ పాల్గొన్నారు.

రూపుదిద్దుకుంటున్న గ్రామ దేవతలు



గ్రామ దేవతల తయారీని పరిశీలిస్తున్న సర్వసమాజ్ సభ్యులు

నిజామాబాద్ సిటీ : ఈనెల 9 ఆదివారం జరుగనున్న ఊర పండగలో ఊరేగించేందుకు గ్రామ దేవతల ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో బండారు పోసిన అనంతరం ఈ ప్రక్రియ ప్రారంభమైంది. వడ్ల కులానికి చెందిన పూజారులు మామిడి చెక్కలతో గ్రామ దేవతలను తయారు చేస్తున్నారు. గురువారం ఈ పనులను సర్వసమాజ్ కన్వీనర్ రామర్తి గంగాధర్, కో కన్వీనర్ ఆదె ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి బంటు రాజేశ్వర్ పరిశీలించారు. నగరంలో తొమ్మిది ప్రాంతాల్లో ప్రతిష్టించే గ్రామ దేవతల విగ్రహాల తయారీ పనులు శనివారం వరకు పూర్తికానున్నాయని వారు పేర్కొన్నారు.



సాలూర మండల కేంద్రం శివారులోని మంజీర నదిలో ప్రవహిస్తున్న వరద నీరు

మంజీరకు జలధార

బోధన్ : తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో సాలూర మండల కేంద్రం శివారులో మంజీర నదిలో వరద నీరు చేరుతోంది. బుధవారం రాత్రి మంజీర నదికి ఎగువన ఉన్న మహారాష్ట్ర ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి వరద నీరు ప్రవహిస్తోంది. కొత్తనీరు ప్రవాహంతో నది జలకళను సంతరించుకుంది. దీంతో నది పరివాహక ప్రాంత రైతుల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో రాయితీ చేపపిల్లల పంపిణీ

- ఏర్పాట్లు చేస్తున్న మత్స్యశాఖ
- 4.71కోట్ల చేప పిల్లలకు పూర్తయిన టెండర్లు
- 1,018 చెరువుల్లో వచ్చేనెల వదలనున్న అధికారులు



డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలో రాయితీ చేప పిల్లల పంపిణీకి మత్స్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది చిన్నవి, పెద్దవి కలిపి 1,018 చెరువుల్లో 4.71 కోట్ల చేప పిల్లలను వదలాలని ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందుకు గాను రూ.4.60కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా వేసింది. అయితే, చేప పిల్లల పంపిణీ కోసం ఎప్పటి లాగే ఈ–ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లను ఆహ్వానించారు. గత నెల 27న అదనపు కలెక్టర్ చాంబర్‌లో టెండర్లను కూడా తెరిచారు. నలుగురు వ్యక్తులు టెండర్లలో పాల్గొన్నారు. ముందుగా టెక్నికల్ బిడ్‌ను తెరిచిన అధికారులు, క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లి గుత్తేదార్లకు ఉన్న చేపల చెరువులను పరిశీస్తున్నారు. పరిశీలన పూర్తయిన వెంటనే ఫైనాన్షియల్ బిడ్‌ను కూడా తెరవనున్నారు. ఐతే, చేపలు పంపిణీ చేసేందుకు గతేడాది టెండర్లలో పాల్గొన్న వ్యక్తులే ఈ ఏడాది టెండర్లలో కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది. గుత్తేదార్ల మధ్య పోటీ నెలకొంటుందా..? అందరూ రింగై చేప పిల్లలను సరఫరా చేస్తారనేది వేచి చూడాలి.

రెండు సైజులు, మూడు రకాలు..

జిల్లాలోని చెరువుల్లో వదలనున్న చేప పిల్లలు మొత్తం మూడు రకాలు, రెండు సైజుల్లో ఉండనున్నాయి. 35–40ఎంఎం సైజున్న 2.89కోట్ల పిల్లలను 866 సీజనల్ చెరువుల్లో, అలాగే 80–100 సైజు గల 1.82కోట్ల పిల్లలను 152 చెరువుల్లో వదలాలని మత్స్య శాఖ కార్యాచరణ రూపొందించింది. కాగా, ఇందులో బొచ్చ, రవాట, బంగారు తీగ రకాల చేప పిల్లలున్నాయి. అయితే, ఆగస్టు నెలలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

1,018	354	4.71 కోట్లు	4.6 కోట్లు	1.42 కోట్లు
జిల్లాలో చెరువులు	మత్స్య పారి శ్రామిక సంఘాలు	పంపిణీ చేయనున్న చేప పిల్లలు	అవసరమయ్యే నిధులు	ప్రభుత్వం ఉత్పత్తి చేస్తున్న పిల్లలు

పోచంపాడ్‌లో చేప పిల్లల ఉత్పత్తి

గుత్తేదార్లు సరఫరా చేసే చేప పిల్లలే కాకుండా ప్రభుత్వం కూడా సొంతగా ఉత్పత్తి కేంద్రాన్ని నిర్వహిస్తోంది. అది పోచంపాడ్‌లో ఉండగా, ఈ ఏడాది 1.42 కోట్ల పిల్లలను (35–40ఎంఎం) ఉత్పత్తి చేయాలని మత్స్య శాఖ లక్ష్యాన్ని పెట్టుకుంది. అదే విధంగా గతేడాది జిల్లా వ్యాప్తంగా 1,018 చెరువుల్లో 4.71కోట్ల పిల్లలు వదలాలని టార్గెట్ ఉండగా, 4.58కోట్లు వదిలారు. 17,957 టన్నుల ఉత్పత్తి జరుగుతుందని అంచనా వేయగా, 16,686టన్నుల ఉత్పత్తి జరిగింది.

నాణ్యమైనవి పంపిణీ చేసేలా చూస్తాం

ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యానికనుగుణంగా చెరువుల్లో చేప పిల్లలను వదులుతాం. టెండరు ప్రక్రియ ఇప్పటికే పూర్తి కాగా ఫైనాన్షియల్ బిడ్ తెరవాల్సి ఉంది. గుత్తేదార్లు నాణ్యమైన పిల్లలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రాజ నర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి

క్లుప్తంగా

సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్అర్బన్: ఇంజినీరింగ్‌లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం పాలిటెక్నిక్ కళాశాలలో 163 మంది విద్యార్థుల ధృవపత్రాలు పరిశీలించారు. శుక్రవారంతో కౌన్సెలింగ్ ముగుస్తుందని పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీరామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): ఆగస్ట్ మొదటి వారం నాటికి పీజీ కోర్సులకు సంబంధించి సిలబస్‌ను పూర్తి చేయాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి సూచించారు. గురువారం సాయంత్రం వివిధ విభాగాల హెచ్‌వోడీలతో తన ఛాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఆయా విభాగాలకు సంబంధించి సిలబస్‌ను ఎంతవరకు పూర్తి చేశారనే వివరాలు తెలుసుకున్నారు. వచ్చే సోమవారం కల్లా మొదటి ఇంటర్నల్ అసెస్‌మెంట్స్ పూర్తి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, కంట్రోలర్ ఎం అరుణ, హెచ్‌వోడీలు లావణ్య, అపర్ణ, చంద్రశేఖర్, నాగరాజు, సమత, స్వప్న, సంపత్, గులేరాణా, జవేరియా, జమీల్ అహ్మద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'మోడల్' టీచర్ల బదిలీ ప్రక్రియ

నిజామాబాద్అర్బన్: ప్రభుత్వం మోడల్ స్కూల్ టీచర్ల బదిలీల ప్రక్రియ మొదలు పెట్టడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 10 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో 367 మంది టీచర్లు పనిచేస్తున్నారు. బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 5న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం ముగియనున్నది. ఈ నెల 21 తర్వాత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మరోవైపు మోడల్ స్కూల్లోని కొందరు టీజీటీలు తమకు కేటాయించిన పాయింట్లు తక్కువగా ఉన్నాయని కోర్టుకెళ్లినట్లు సమాచారం. దీనిపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఎస్ఎల్ఆర్ ఏడీగా శ్రీనివాసులు

సుభాష్‌నగర్: జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్‌గా సిహెచ్ శ్రీనివాసులును నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఏడీగా పనిచేసిన శ్యాంసుందర్ ఇటీవల ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. శ్రీనివాసులు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. శ్రీనివాసులు హైదరాబాద్‌లో ఆ శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన శుక్రవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

పెంపుడు కుక్కలకు టీకా



కుక్కను ఎత్తుకొని వస్తున్న యువతి

నగరంలో వివిధ రకాల కుక్కలు కనువిందు చేశాయి. జూనోసిస్ డే సందర్భంగా గురువారం నిజామాబాద్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా నగరంలో పలువురు పెంపుడు శునకాలను తీసుకువచ్చి టీకా వేయించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్



షిట్‌జూ శునకం



ల్యాబ్రెడర్ జాతి కుక్క





రాట్‌వీలర్ జాతి శునకం



జర్మన్ షెఫర్డ్ రకం కుక్క



డ్యాష్ అండ్ డ్యాష్ రకం..

మెడికల్ ప్రాక్టీస్‌పై విద్యార్థులకు అవగాహన



మెడికల్ కాలేజీ విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఇందిరా తదితరులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మెడికల్ కళాశాల 2017 హౌస్ సర్జన్ విద్యార్థులకు గురువారం మెడికల్ ప్రాక్టీస్‌పై మెడికల్ కాలేజీ, ఐఎంఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, నాగమోహన్, జలగం తిరుపతిరావు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మెడికల్ కళాశాలలోని ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఐఎంఏ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ రవీందర్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. గతంలో 20 మంది విద్యార్థులకు రూ.20వేల చొప్పున చెక్కులను పంపిణీ చేయగా, నాడు చెక్కులు తీసుకోని నలుగురికి గురువారం అందజేశారు.

ప్రారంభం కాని పనులపై స్పీకర్ ఆగ్రహం



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసినా.. క్షేత్ర స్థాయిలో పనులు మొదలు పెట్టకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వర్నిలో చందూర్, మోస్రా, వర్ని, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్ పనులపై సమీక్ష సమావేశాన్ని స్పీకర్ నిర్వహించారు. వారంలోపు ఆయా పనులు ప్రారంభించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించక పోతే కాంట్రాక్టు రద్దు చేసి ఇతరులకు అప్పగించాలని సూచించారు.

నగరంలో ఈడీ సోదాలు?

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో ఖిల్లా రోడ్డులోని ముస్తాయిదాపురా కాలనీలో ముగ్గురు సభ్యులతో కూడిన ఈడీ బృందం తనిఖీలు చేసినట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో గోదాంలు ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై పోలీసులు వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు.

క్రైం కార్నర్

దుబాయిలో రోడ్డు ప్రమాదంలో మృతి



సుభాష్(ఫైల్)

తాడ్వాయి:మండలంలోని పల్లెగడ్డా తండా పరిధిలోని ఫిర్మాయికుంట తండాకు చెందిన లంబాడి సుభాష్(40) దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సుభాష్ బతుకు దెరువు కోసం గత ఐదేళ్లుగా గల్ఫ్ వెళ్తున్నాడు. మూడు నెలల క్రితం దుబాయి నుంచి సెలవుపై వచ్చి మళ్లీ వెళ్లాడు. ఈ నెల 5న రోడ్డు పక్కన పని చేస్తున్న సుభాష్‌ను కారు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సుభాష్‌కు భార్య చాంగ్‌బాయి, ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

గుండెపోటుతో ఒకరు..



హైమద్ (ఫైల్)

భిక్కనూరు: భిక్కనూరుకు చెందిన ఆర్ఎంపీ హైమద్ గురువారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామంలోని గాంధీచౌరస్తాలో ప్రథమ చికిత్సాలయం నిర్వహిస్తున్న హైమద్ మూడు రోజుల క్రితం బంధువుల ఇంటికి హైదరాబాద్ వెళ్లాడు. బుధవారం సాయంత్రం ఆయనకు ఛాతీలో నొప్పి రావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

రామారెడ్డి: అప్పుల బాధ, అనారోగ్య కారణాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామారెడ్డిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మాసన్నగారి కలవ్వ(48) తన ఇద్దరి కుమారుల వివాహం ఒకే ఏడాది చేసింది. దీని కోసం అప్పులయ్యాయి. అలాగే కలవ్వ, ఆమె భర్త ఆరోగ్యం బాగా లేక పోవడంతో చికిత్స కోసం అప్పు చేశారు. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలనే మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె పెద్ద కొడుకు లింబాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో నివాసం ఉండే ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై ప్రసాద్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్నూర్‌కు చెందిన ప్రఫుల్ కుమార్ తాడ్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ దేవునిపల్లిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 6న ఉదయం ఇప్పటిలాగే విధులకు వెళ్లాడు. ఉదయం 11:35 గంటల ప్రాంతంలో అతని భార్య పూజ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. చాలా చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ప్రఫుల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోతె గ్రామానికి చెందిన మహిళ..

వేల్పూర్: మండలంలోని మోతె గ్రామానికి చెందిన కొలిప్యాక లక్ష్మి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఆమె భర్త ప్రవీణ్‌తో మనస్పర్ధలు వచ్చి గురువారం ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టేకు కలప స్వాధీనం

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం గౌరారం అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ అధికారి హిమ చందన తెలిపారు. టేకు దుంగలు ఎవరు నిల్వ ఉంచారన్న కోణంలో విచారణ చేస్తున్నామని, స్వాధీనం చేసుకున్న దుంగలను రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

డిచ్‌పల్లి: అనుమతులు లేకుండా తన పంట పొలంలో ఉన్న టేకు చెట్లను నరికి వాహనంలో బోధన్‌కు తరలిస్తున్నారనే సమాచారం మేరకు డిచ్‌పల్లి సమీపంలో పట్టుకుని ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు రేంజ్ అధికారిని హిమాచందన గురువారం రాత్రి తెలిపారు. మిట్టపల్లి గ్రామ శివారులోని ఒక పంట పొలంలో టేకు చెట్లను నరికి టేకు దుంగలను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో సెక్షన్ అధికారి బాపురావు, బీట్ అధికారులు సాయికుమార్, వినోద్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బందితో కలిసి వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు.

పది ట్రాక్టర్ల ఇసుక సీజ్



సిరికొండ:మండలంలోని మైలారం రెవెన్యు శివారు సర్వే నంబర్ 579 లో నిర్మిస్తున్న ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పది ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ గఫార్‌మియా గురువారం తెలిపారు. ఫంక్షన్ హాల్ యాజమాని ముషీర్ అక్రమంగా ఇసుకను నిల్వ చేశాడని వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యు ఇన్‌స్పెక్టర్ గంగరాజంను విచారణకు పంపించినట్లు ఆయన తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను ఈ నెల 10న తహసీల్ కార్యాలయంలో వేలం వేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు రూ. 5వేలు దరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఛత్రపతి నగర్‌లోని త్రివర్ణ గణేశ్ కాలనీకి చెందిన హరిపురి శారద ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై సాయినాథ్ తెలిపారు. వివరాలు.. శారద ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. ఆమె ఉదయం స్కూల్‌కు వెళ్లగా భర్త రవి ఆటో రిపేర్ చేయించుకోవడానికి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. దొంగలు ఇంటి తాళం పగలగొట్టి రెండు తులాల బంగారు ఆభరణాలు, ఆరు తులాల వెండి ఆభరణాలు, రూ.42 వేలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నారాయణపల్లెలో..

సిరికొండ: నారాయణపల్లెలో బుధవారం చోరీ జరిగిందని ఎస్సై నర్సింలు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన పూజారి లక్ష్మి ఇంటి తలుపులను దొంగలు తొలగించి అల్మారాలో గల అర తులం బంగారు చెవి కమ్మలు, మాటిలు ఎత్తుకెళ్లారని చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యాసంస్థలను పరిశీలించిన అధికారులు



ఖండ్‌గాం పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్



కిసాన్‌నగర్‌లో విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తున్న డీఐఈవో రఘురాజ్, ప్రిన్సిపాల్

బోధన్: మండలంలోని ఖండ్‌గాం ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం డీఈవో దుర్గాప్రసాద్ సందర్శించారు. ఎంఈవో నాగ్‌నాథ్, ఎస్ఎంసీ సభ్యులు, సర్పంచ్ లాలయ్య, కల్దుర్కి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఇల్తెపు శంకర్, హెచ్ఎం సంజీవ్‌కుమార్‌తో సమావేశమయ్యారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం నిధులతో ప్రహరీ నిర్మించాలని తీర్మానం చేశారు.

కళాశాలలను తనిఖీ చేసిన డీఐఈవో

బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలను, మెండోరా మండలం పోచంపాడ్‌లోని గురుకుల కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజు తనిఖీ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేసిన అడ్మిషన్ల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం అధ్యాపకులతో కలిసి కిసాన్‌నగర్, వన్నెల్(బి) గ్రామాల్లో తిరిగి ప్రచారం చేశారు. ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు. ప్రిన్సిపాల్స్ చిన్నయ్య, చంద్రశేఖర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

ఆర్మూర్‌టౌన్: బడికి వెళ్లే విద్యార్థులను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని జిల్లా లీగల్ కంప్రొబేషనరి అధికారి ఘటడి అనిల్ హెచ్చరించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాల నుంచి 14 ఏళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలన్నారు. షీ టీం ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి, కానిస్టేబుల్ సుమలత, విగ్నేష్ పాల్గొన్నారు.

దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు →



న్యాయం చేయాలని మహిళల రాస్తారోకో



తాడ్వాయి: మండలంలోని నందివాడకు చెందిన డ్వాక్రా మహిళలు గురువారం ఎర్రాపహాడ్‌లోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో రాస్తారోకో చేశారు. కలెక్టర్, డీఆర్‌డీవో, ఐకేపీ బ్యాంకు అధికారులు ఎవరు తమను పట్టించుకోవడం లేదని, న్యాయం జరిగేంత వరకు కదిలేదని ఆందోళన చేశారు. గ్రామంలోని 21 మహిళా సంఘాల పొదుపు డబ్బులను అదే గ్రామానికి చెందిన వీవోఏ బాబాగౌడ్ సొంతానికి వాడుకున్న విషయం తెలిసిందే. దీంతో డీఆర్‌డీవో సాయన్న జూన్ 16న గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి బాబాగౌడ్‌పై విచారణ జరిపించారు. డబ్బులను తీసింది వాస్తవమేనని బాబాగౌడ్ ఒప్పుకున్నాడు. అయితే రూ.16 లక్షలు మాత్రమే కట్టిస్తానని ఆయన చెప్పడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. తమకు రావాల్సిన రూ.36 లక్షలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు, ఐకేపీ అధికారులు కుమ్మక్కై తమ డబ్బులను దోచుకున్నారని మండిపడ్డారు. ఏఎస్సై సంజీవులు తన సిబ్బందితో అక్కడికి వచ్చి సముదాయించినా వారు వినలేదు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగేలా చూస్తానని బ్యాంకు మేనేజర్ హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు.

కేజ్‌వీల్ ట్రాక్టరు పట్టివేత

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్‌లో గురువా రం పట్టీలు లేకుండా తారురోడ్డుపై తిరుగుతున్న కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. పట్టీలు లేకుండా కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

18 నుంచి పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో పీజీ ఎంబీఏ, ఎంసీఏ 2వ, 4వ సెమిస్టరు, ఇంటిగ్రేటెడ్ పీజీ ఐఎంబీఏ, ఐపీఈ, ఐపీసీహెచ్ 8వ, 10వ సెమిస్టరు, ఎల్ఎల్‌బీ 6వ సెమిస్టర్స్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు జూలై 18 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telangan auniversi ty.ac. in ను సంప్రదించాలని సూచించారు.

గిరిజనులపై ఫిర్యాదు చేసిన ఫారెస్టు అధికారులు



పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చిన గిరిజనులు

లింగంపేట: మండలంలోని జగదాంబ తండా, అన్నారెడ్డిపల్లి తండాకు చెందిన పలువురు గిరిజనులపై ఫారెస్టు అధికారులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోడు భూముల పేరిట 9 హెక్టార్ల భూమిని చదును చేసి 3.5 హెక్టార్ల విస్తీర్ణంలో చెట్లను నరికివేశారని బీట్ అధికారి భూపతి, డిప్యూటీ రేంజ్ అధికారి రవి లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో గిరిజనులు పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. రామాయిపల్లి అటవీ శాఖ బీట్ అధికారి నిర్లక్ష్యం కారణంగా పోడు భూములకు పట్టాలు రావడంలేదని వారు ఆరోపించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులకు మొరపెట్టుకున్నారు. అధికారులు స్పందించి తమకు పోడు పట్టాలు అందేలా చూడాలని కోరారు. అటవీశాఖ బీట్ అధికారి ఫిర్యాదు మేరకు ఎఫ్ఆర్‌సీ చైర్మన్ సరిచంద్, గుగులోత్ లక్ష్మణ్, రమావత్ కుమార్, మరి కొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ప్రకాష్‌నాయక్ తెలిపారు.

ప్రియురాలి మోజులో పడి..

- భార్యను పట్టించుకోని భర్త
- ప్రశ్నించినందుకు వరకట్న వేధింపులు
- మనస్తాపంతో యువతి ఆత్మహత్య



భర్తతో కావ్యశ్రీ (ఫైల్)

నవీపేట: ప్రియురాలి మోజులో పడి భర్త తనను పట్టించుకోకపోవడం.. ప్రశ్నిస్తే వరకట్నం కోసం వేధించడంతో మనస్తాపం చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకుంది. నవీపేటలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలను నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ గురువారం వెల్లడించారు. నిజామాబాద్‌కు చెందిన రాజేందర్ కూతురు కావ్యశ్రీ(26)కి నవీపేటకు చెందిన ఎర్ర మహేష్, అరుణల కుమారుడు ఎర్ర మనోజ్‌తో 2020లో వివాహం జరిగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే మనోజ్‌కు మరో అమ్మాయితో వివాహేతర సంబంధం ఉంది. దీంతో కావ్యశ్రీని పట్టించుకోలేదు. కావ్యశ్రీ మానసికంగా కుంగిపోయి తన బాధను పెద్దల దృష్టికి తీసుకెళ్లగా ఇరువురికి సర్దిచెప్పారు. మనోజ్‌కు అప్పులు ఉండడంతో కావ్యశ్రీని అదనపు కట్నం కోసం మరింత వేధించాడు. భర్తతో పాటు అత్తమామలు అరుణ, మహేష్ కూడా కావ్యశ్రీని వేధించారు. మానసిక వేదనను భరించలేని కావ్యశ్రీ బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురును అదనపు కట్నం కోసం వేధించడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ కిరణ్‌కుమార్, ఎస్సై రాజారెడ్డి ఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భర్త మనోజ్, అత్తమామలు అరుణ, మహేష్‌పై కేసు నమోదు చేశామని ఏసీపీ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటన స్థలంలో క్షతగాత్రులు

మోపాల్: మండలంలోని శ్రీరాంనగర్ తండాకు చెందిన సురేందర్, గబ్బర్‌సింగ్ ద్విచక్రవాహనంపై జిల్లాకేంద్రానికి వెళ్తుండగా మోపాల్ శివారులో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో సురేందర్ ఇంటర్ చదువుతున్నాడు. కళాశాల పనినిమిత్తం సురేందర్, గబ్బర్‌సింగ్ నిజామాబాద్ వైపు ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తున్నారు. మోపాల్ శివారులో ముందుగా ఉన్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. ప్రమాదంలో సురేందర్ తలకు తీవ్ర గాయం కాగా, గబ్బర్‌సింగ్ కాలు విరిగింది. వెంటనే నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి ఆటోలో తరలించారు. వైద్యుల సూచన మేరకు పరిస్థితి విషమంగా ఉన్న సురేందర్‌ను హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉందని, ప్రస్తుతం కోమాలో ఉన్నాడని, శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించినట్లు గ్రామస్తులు తెలిపారు. గబ్బర్‌సింగ్ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఇదేవిషయమై పోలీసుల వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.